సాక్షి మంచిర్యాల

మంగళవారం । 18 । జూన్ । 2024



అప్రమత్తతే జీవాలకు రక్ష

వర్షాకాలం వ్యాధులు ప్రబలే కాలం. జీవాలు, గేదెలు, ఆవులు వ్యాధుల బారిన పడకముందే జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



ట్రెజరీలోనే చెక్కులు

ప్రభుత్వ పనులకు సంబంధించి నెలల తరబడి బిల్లుల చెల్లింపులు జరగక ట్రెజరీలోనే చెక్కులు మూలుగుతున్నాయి. దీంతో ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.0 /28.0

వాతావరణం

ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ బదిలీ

- కొత్త డీసీపీగా ఏ.భాస్కర్





డీసీపీ అశోక్‌కుమార్ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ బదిలీ అయ్యారు. 110రోజులుగా ఇక్కడ పని చేస్తున్న ఆయనను జగిత్యాల జిల్లా ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ యాంటి నార్కొటిక్ బ్యూరో ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న 2010 బ్యాచ్ గ్రూప్–1 ఆఫీసర్ ఏ.భాస్కర్‌ను మంచిర్యాల డీసీపీగా నియమించారు. 2019బ్యాచ్‌కు చెందిన అశోక్ కుమార్ మంచిర్యాల డీసీపీగా ఈ ఏడాది మార్చి 2న బాధ్యతలు స్వీకరించి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్రవేశారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను కాపాడేందుకు ప్రత్యేక రెస్క్యూ టీంను తయారు చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రెస్క్యూ చేసి ప్రజలను కాపాడేందుకు ఉపయోగించే పరికరాల కొనుగోలుకు అప్పటి కలెక్టర్ బదావత్ సంతోష్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. రెస్క్యూ టీంకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఇటీవల ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రదర్శన నిర్వహించి తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇటు జిల్లా ప్రజల, అటు పోలీసు ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. కాగా, జిల్లాకు డీసీపీగా బదిలీ అయిన ఎగ్గడి భాస్కర్ జగిత్యాల జిల్లా ఎస్పీగా తొమ్మిది నెలలపాటు పని చేశారు. ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లాలో డీఎస్పీగా 2016 డిసెంబర్ నుంచి 2017 ఏప్రిల్ వరకు విధులు నిర్వర్తించారు.

బెల్లంపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలి



డీఈ రాజన్నకు అర్జీ అందిస్తున్న బస్తీ వాసులు

బెల్లంపల్లి: శివాలయం ఫీడర్ నుంచి కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని వెంటనే బెల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరాకు చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి మున్సిపాలిటీ 18వార్డు కాంట్రాక్టర్ బస్తీ ప్రజలు ఫిర్యాదు చేశారు. సోమవారం విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో లిఖిత పూర్వకంగా అర్జీని డీఈ రాజన్నకు అందజేశారు. శివాలయం ఫీడర్ ద్వారా సరిగా కరెంట్ సరఫరా కావడం లేదని, తరచూ ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు కే.రాంమ్మోహన్, కే.శ్రీనివాస్ తదితరులు కోరారు.

అలరించిన రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో టాలెంట్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు అలరించాయి. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకుడు దుర్గం నరేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది కళాకారులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాత్కు సుదర్శన్, గుడ్ల రమేష్, నరేష్, టాలెంట్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు రాంబాబు, కళాకారులు గోపి, లక్ష్మణ్, రమేష్, వసుధ, అర్చన వనిత, శివాణి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే నియామకం



నియామక పత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఖానాపూర్ ఉద్యానవన శాఖ అధికారి మౌనిక సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు గడించవచ్చన్నారు. కంపెనీ ఏరియా మేనేజర్ మనోజ్‌రెడ్డి, క్లస్టర్‌అధికారి దినేష్ పాల్గొన్నారు.

పట్టపగలే పడకలేస్తూ!



కారులో వస్తున్న విటుడు



లక్ష్మీనగర్‌రోడ్ నంబర్-5లో ఓ ఇంటి నుంచి వెళ్తున్న విటుడు

జిల్లా కేంద్రం మంచిర్యాల పట్టణ నడిబొడ్డున లక్ష్మీనగర్ రోడ్ నంబరు–5 కాలనీలో ఇళ్ల మధ్యే పడుపు వృత్తి సాగుతోంది. రోజూ ఓ ఇంటికి పది మందికి పైగానే విటులు వచ్చి వెళ్తున్నారు. ఓ మహిళనే ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. నిత్యం ఇద్దరు ముగ్గురు అమ్మాయిలతో వ్యభిచారం సాగిస్తున్నారు. ఇక్కడి నిర్వాహకులతో పోలీసులకు ఉన్న పరిచయాలతో చూసీ చూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఇళ్ల మధ్యే పగలు, రాత్రి తేడా లేకుండా నిర్భయంగా, నిరాటంకంగా కొనసాగుతోంది.

- అమ్మాయిలను రప్పిస్తూ విటులకు పిలుపు
- జిల్లా కేంద్రం, శివారుల్లో గుట్టుగా పడుపు వృత్తి
- రాత్రింబవళ్లు కార్యకలాపాలు
- పోలీసు నిఘా తగ్గడంతో యథేచ్ఛగా నిర్వహణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: డబ్బు సంపాదనే లక్ష్యంగా పడుపు వృత్తి గుట్టుగా సాగుతోంది. గత కొంతకాలంగా జిల్లా కేంద్రం, సమీప ప్రాంతాల్లో రాత్రింబవళ్లు నడుస్తోంది. జిల్లాకు రైల్వే, రోడ్డు మార్గాలు ఉండడంతో ఆంధ్రా, వరంగల్, హైదరాబాద్‌తోపాటు స్థానిక అమ్మాయిలు, మహిళలను రప్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపం, తోళ్లవాగు, లక్ష్మీనగర్, గద్దెరాగడి శివార్లలో ఎవరికీ చిక్కకుండా ఇళ్ల మధ్యలోనే ఈ వ్యాపారం నడుస్తోంది. గతంలో లాడ్జీలు, హోటళ్లు అడ్డాలు కాగా, ప్రస్తుతం ఇళ్ల మధ్యనే నడుస్తున్నాయి. ఇంటి యజమానులు లేని ఇళ్లలో ఎక్కువగా నడుస్తోంది. గతంలో పోలీసులకు చిక్కిన వ్యక్తితో మరికొందరు ఈ దందాలో ఆరితేరిపోయారు. బయటకు పొక్కకుండా సాగుతుండడంతో గత కొంతకాలంగా విటులు పెరిగిపోయారు. ఎక్కడైనా ఇబ్బందిగా మారితే, వెంటనే వేరే చోటుకి మకాం మార్చుతున్నారు.

వాట్సాప్‌లో ఫొటోలు

'సర్వీస్' అవసరమైన వారికి వాట్సాప్‌లోనే అమ్మాయిల ఫొటోలు పంపిస్తూ ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు. వివరాలు చూపించి, రేటు చెబుతున్నారు. 'సర్వీస్' కావాలంటే గూగుల్/ఫోన్‌పే, క్యాష్ తీసుకుంటున్నారు. మంచిర్యాల, గోదావరిఖని, ఆసిఫాబాద్, తదితర ప్రాంతాల నుంచి విటులను రప్పిస్తున్నారు. అమ్మాయిల ఆకృతి, వయస్సు, ప్రాంతం తదితర వివరాలను బట్టి రేటు ఫిక్స్ చేస్తున్నారు. కనీసం రూ.1500 నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ డబ్బులో నిర్వాహకులకు సగం వరకు తీసుకుంటూ మిగతాది అమ్మాయిలకు ఇస్తున్నారు. ఒక్కో అమ్మాయి/మహిళ ఒకసారి వచ్చారంటే నాలుగైదు రోజుల వరకు ఇక్కడే ఉంటున్నారు. రూ.10 వేల నుంచి రూ.20వేలు చేతిలో పడ్డాక వెళ్లిపోతున్నారు. వారికి భోజన, వసతి నిర్వాహకులు చూసుకుంటున్నారు. విటుల్లో కొందరు రాజకీయ, వ్యాపార, ఉద్యోగ, రోజు వారీ కార్మికులతోపాటు యువత ఉంటున్నారు.

ఆర్థిక కష్టాలతో రొంపిలోకి..

అనైతిక పనులు చేస్తున్నామని తెలిసినా కుటుంబ పరిస్థితులు, ఆర్థిక కష్టాలతో కొందరు అమ్మాయిలు ఇష్టం లేకున్నా ఈ వృత్తిలోకి వెళ్తున్నారు. ఈ బలహీనతే నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు. ఈ వృత్తిలో దిగాక బయటకు వెళ్లలేకపోతున్నారు. రెండేళ్ల క్రితం జిల్లాలో ఓ పట్టణానికి చెందిన ఓ అమ్మాయి తన తల్లిదండ్రులను కోల్పోయి నిస్సహాయతతో ఉండగా, సొంత బంధువులే సిరిసిల్లలో వ్యభిచారం కూపంలోకి నెట్టారు. ఈ ఘటన అప్పట్లో అందరినీ కలిచివేసింది. రెండేళ్ల క్రితం జిల్లా కేంద్రంలో శ్రీనివాస కాలనీలో స్థానికులతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు.

ప్రమాదకర రోగాలు

సురక్షితం కాని శృంగారంతో అనేక అంటువ్యాధులకు మూల కారణమవుతాయని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, వైరల్ హెపటైటీస్, హెర్పెస్, గొనొర్హి తదితర సుఖవ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. బయటి వ్యక్తులతో సంబంధాలు నడిపితే, కుటుంబాల్లోని వ్యక్తులకు ఈ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



మంచిర్యాల బస్టాండ్ వద్ద ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



ఈద్గా వద్ద చిన్నారులతో మాజీ ఎమ్మెల్యే దివాకర్



మందమర్రిలో ముస్లింలతో ఎమ్మెల్యే వివేక్



శుభాకాంక్షలు తెలియజేస్తున్న చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే ఈద్గా, మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంచిర్యాల బస్టాండ్ వద్ద ఈద్గాతోపాటు ఆండాళమ్మ కాలనీ ఈద్గా, మసీదులో ప్రత్యేక నమాజ్ చేశారు. మతపెద్ద ముఫ్తీ మాషకూర్ ఇమామ్ ఇంతియాజ్ మాట్లాడుతూ ఇస్లాం సూచించిన సన్మార్గంలో నడవాలని అన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా అలాయ్‌బలాయ్‌తో శుభాకాంక్షలు చెబుతూ మతసామరస్యాన్ని చాటిచెప్పారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పండుగ సందర్భంగా ఈద్గా, మసీదుల వద్ద చిరువ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాల్లో చిన్నారులు ఆటవస్తువులు కొనుగోలు చేశారు. ఈద్గాల వద్ద మంచిర్యాల మాజీ శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య తదితరులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ముగిసిన ధాన్యం సేకరణ



సేకరించిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాలు ఎత్తివేత
- 1.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు
- అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడ్డ రైతులు
- నగదు కోసం తప్పని ఎదురుచూపులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ ఎట్టకేలకు ముగిసింది. ఇక రైతులకు నగదు చెల్లింపు మిగిలింది. ఈ ఏడాది రైతులు ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాల్లో అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఇంకా మిల్లు ట్యాగింగ్ లేక రైతులకు నగదు జమ కావడం లేదు. రోజుల తరబడి తూకం లేక, రవాణాకు లారీలు లేక ఇబ్బందులు, తరుగు కోతతో విసుగెత్తిన రైతుల ఆందోళనల మధ్య కొనుగోళ్లు సాగాయి. మరోవైపు అకాల వర్షాలు రైతులను దెబ్బతీశాయి. 1.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 1.56లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. లక్ష్యం కంటే 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా వచ్చింది. గత ఏడాది ప్రభుత్వం జూన్ మొదటి వారంలోగా ధాన్యం సేకరణ పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలు మూసి వేయాలని ఆదేశించింది. దీంతో ఆలస్యంగానైనా తేరుకున్న అధికారులు ఆగమేఘాలపై లారీలను కేంద్రాలకు పంపించి వెంట వెంటనే తరలించారు.

తరుగు తీత తప్పలేదు..

గన్ని సంచులు, హమాలీల కొరత, లారీలు రాక రోజుల తరబడి ఎదురుచూపులు తప్పలేదు. మిల్లర్లు తరుగు పేరుతో బస్తాకు 3 నుంచి 6కిలోల వరకు కోతలు విధించారు. లారీల కోసం పడిగాపులు కాసిన రైతులు డ్రైవర్లకు రూ.2వేల నుంచి రూ.4వేల వరకు నగదు చెల్లించి మరీ కొనుగోలు కేంద్రాలకు లారీలను తీసుకెళ్లి ధాన్యం బస్తాలు లోడింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఒకటికి రెండుసార్లు తూర్పాల పట్టినా తూకం వేసి మిల్లుకు వెళ్లిన తర్వాత తరుగు తప్పలేదని రైతులు వాపోయారు. 50కి పైగా కిలోమీటర్ల దూరంలోని రైస్‌మిల్లులకు కేటాయిస్తే పొల్లు, పెల్ల ఉందంటూ అక్కడి మిల్లర్లు కొర్రీలు పెట్టారు. మిల్లు దూరం కావడంతో రైతులు అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఉండడంతో ఒక్కో ట్రిప్‌కు సుమారు 15 నుంచి 20క్వింటాళ్ల వరకు తరుగు పేరిట కోత విధించారు.

జీరో కొనుగోళ్లు..

కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షించి అకాల వర్షాలతో ఇబ్బందులు పడ్డారు. గన్ని సంచులు, లారీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు గ్రామాల్లో జీరో కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులను ఆశ్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 ఉండగా వ్యాపారులు ఎలాంటి కోతలు లేకుండా రూ.1500 నుంచి రూ.1700 ధరతో కొనుగోలు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే 20 రోజుల వరకు నగదు అందడం లేదని, వ్యాపారులకు విక్రయిస్తే వెంటనే చెల్లించడంతో కొందరు రైతులు ధర తక్కువైనా అమ్ముకున్నారు.

నగదు చెల్లింపులోనూ ఆలస్యం..

జిల్లాలో 55 రోజులపాటు ధాన్యం సేకరణ చేపట్టగా 25,766 మంది రైతుల నుంచి రూ.340,80,97,854 విలువైన 1,56,119.920 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించారు. ఇప్పటి వరకు 21,133 మంది రైతులకు రూ.274,02,85,783 చెల్లించారు. ఇంకా 4,633 మంది రైతులకు రూ.66,78,12,071 చెల్లించాల్సి ఉంది. 25 రోజులు గడిచినా నగదు జమ కాలేదని రైతులు వాపోతున్నారు. నగదు అందితే ఖరీఫ్ పంటల విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సామగ్రి కొనుగోలు చేద్దామని ఎదురు చూస్తున్నారు.

వెంటాడుతున్న భయం



గతేడాది వార్డుల్లోకి చేరిన వరద నీరు(ఫైల్)



పెచ్చులూడిన స్లాబ్

- శిథిలావస్థలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి
- వర్షాకాలంలో పెచ్చులూడుతున్న స్లాబ్
- భారీ వర్షాలకు ఆస్పత్రిలోకి వరద నీరు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోననే భయం వైద్యులు, సిబ్బందిని వెంటాడుతోంది. భారీ వర్షం కురిస్తే చాలు వరద నీరు ఆస్పత్రి ఆవరణ, వార్డుల్లోకి చేరుతోంది. భవనం స్లాబ్ ఉరుస్తూ.. పెచ్చులూడి పడుతుండడంతో రోగులు, వైద్యులను భయాందోళనకు గురి చేస్తోంది. గత ఏడాది మూడు నెలల వర్షాకాలంలో రోగులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది వర్షాకాలం నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గత మూడేళ్లుగా గోదావరి ఒడ్డున ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) ప్రతియేటా వర్షాకాలంలో మునుగుతోంది. వరద తీవ్రత పెరగగానే ఎంసీహెచ్‌లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులను జీజీహెచ్‌కు తరలించి నాలుగు నెలలపాటు ఇక్కడే ఆస్పత్రి నిర్వహిస్తున్నారు.

నాలుగు నెలలు ఎలా గడుస్తుందో..

జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు నెలలపాటు జీజీహెచ్‌లో రోగులు, వైద్యసిబ్బందికి ఎలా గడుస్తుందోననే ఆందోళన నెలకొంది. జీజీహెచ్ భవనం శిథిలావస్థకు చేరడంతో పక్కనే మూడు అంతస్తులతో గతంలోనే మరో భవనం నిర్మించారు. అందులోనే ఐసీయూ, బాలింతల వార్డులు, ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. పాత భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు, గర్భిణుల వార్డులు, సిటి స్కాన్, ల్యాబ్‌లు, ఎక్స్‌రే, ఓపీ విభాగం, ఆరోగ్యశ్రీ మందులు, ఓపీ సేవలు ఉన్నాయి. పాత, కొత్త భవనాల్లో వర్షానికి స్లాబ్ నుంచి వర్షపు నీరు కిందికి కారుతోంది. గత ఏడాది స్లాబ్ పెచ్చులు ఊడిపడడంతో వైద్య సిబ్బంది పరుగులు తీశారు. వరద నీరు ఆసుపత్రి లోపలికి చేరడంతో వార్డులన్నీ నీటితో నిండిపోయాయి. ఆసుపత్రిలో నిల్వ ఉంచిన మందులు తడిసిపోయాయి. పరికరాలు పాడు కాగా, రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. గర్భిణులు, బాలింతలు, రోగులతో కిటకిటలాడే ఆసుపత్రి వర్షాకాలం మాత్రం ఇబ్బందులకు గురిచేస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో ఆసుపత్రిలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

కష్టమైనా ఇక్కడే నిర్వహణ



ఆసుపత్రిలో ప్రతియేటా వర్షాకాలంలో స్లాబ్ నుంచి వర్షపు నీరు కారడం, పెచ్చులు ఊడిపోవడం వంటివి జరుగుతున్నాయి. మొత్తం మరో చోటికి మారిస్తే ఇబ్బంది లేకుండా ఉంటుంది. కానీ ఆసుపత్రి భవనం మార్చేందుకు సరిపడా ఇతర భవనాలు లేవు. కాలేజీరోడ్డులోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి కావాలంటే మరో ఏడాది వరకు ఆగాల్సిందే. అప్పటి వరకు కష్టమైనా ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలోనే నిర్వహణ చేపడతాం. భారీ వర్షాలు కురిస్తే భవనానికి ప్రమాదం ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

జిల్లాలో పనిచేయడం సంతోషకరం



బి.సంతోష్‌ను సన్మానిస్తున్న వివిధ శాఖల అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్/మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో పని చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని గత కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. ఇటీవల బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లిన ఆయనను సోమవారం వివిధ శాఖల అధికారులు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో జిల్లా ప్రజలకు అభివృద్ధి, పథకాలు చేరవేశారని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు అధికారుల సమన్వయంతో విజయవంతం చేశామని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, డీపీఓ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్ సంతోష్‌కు జ్ఞాపికను అందజేశారు.

- బదిలీపై వెళ్లిన బదావత్ సంతోష్‌కు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఘనంగా వీడ్కోలు సన్మానం చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత, ఏవో విశ్వేశ్వర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, చారి పాల్గొన్నారు.
- సంతోష్‌ను సోమవారం టీఎన్జీవోస్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి వీడ్కోలు సన్మానం చేశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ప్రధాన కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు సుమన్, సఫ్దర్ అలీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి
- అధికారులతో సమీక్ష సమావేశం



సమావేశంలో ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. పైపులైన్ లీకేజీలు ఉంటే త్వరితగతిన మరమ్మతులు చేసి ప్రతీ ఇంటికి నీరు సరఫరా అయ్యేలా చూడాలని తెలిపారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ పథకం ద్వారా మంజూరైన రూ.28 కోట్లు ఎందుకు ఆగిపోయాయని మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మిషన్ భగీరథ ఏఈ సరిత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పూజలు

జైపూర్: మండలంలోని ఇందారం వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతియేటా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

జీవితంపై విరక్తితో ఆత్మహత్య


గోపి మృతదేహం

జన్నారం: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ వివరాల మేరకు కృష్ణా జిల్లా నందివాడ మండలం పానుకుమాడుకు చెందిన వెన్నెల గోపి (35) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఎనిమిదేళ్లక్రితం జన్నారం వలసవచ్చాడు. వెల్డింగ్‌షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నినెలలుగా గిరాకి లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని పలుమార్లు భార్యకు చెప్పుకుని బాధపడేవాడు. వేసవి సెలవుల కారణంగా భార్యా, పిల్లలు స్వగ్రామానికి వెళ్లారు. ఈ నెల 15న ఇంట్లో పురుగుల మందు తాగి నిర్మల్ ఉంటున్న తన అన్న నరేశ్‌కు సమాచారం ఇచ్చాడు. నరేశ్ వచ్చి ముందుగా నిర్మల్‌కు అక్కడి నుంచి ఏపీలోని విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం

లింగాపూర్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై తులసీరాం తెలిపిన వివరాల మేరకు మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ రవి (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఇంట్లో గొడవ చేస్తుండడంతో శనివారం అతని భార్య జైనూర్‌లోని సోదరుని ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన రవి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య శాంతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థిని మృతి


వరలక్ష్మి మృతదేహం

కౌటాల: సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ కాలనీకి చెందిన విద్యార్థిని ఎల్ములే వరలక్ష్మి (12) సోమవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక సిర్పూర్(టి) బాలికల కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం ఇంటి వద్ద కూలర్‌ను ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విద్యార్థిని మృతికి కేజీబీవీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. సిర్పూర్(టి) పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు.

అప్రమత్తతే జీవాలకు రక్ష

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు
- వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే మొదటికే ప్రమాదం


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది (ఫైల్)

బెల్లంపల్లిరూరల్/నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలం... వ్యాధులు ప్రబలేకాలం... ముఖ్యంగా జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడేకాలం ఇది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వ్యాధులకు గురికాకముందే పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం. వర్షాకాలం ప్రారంభంలో మూగజీవాలు గొంతువాపు, జబ్బవాపు, చిటికె రోగం, గాలికుంటు లాంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మూగజీవాలకు వచ్చే వ్యాధులు, నివారణ పద్ధతులపై పెంపకందారులకు పశుసంవర్ధకశాఖ అధికారుల సలహాలు, సూచనలు..

జబ్బవాపు :
జబ్బవాపు వ్యాధిని బ్లాక్ క్వార్టర్, బ్లాక్ లెగ్ అని కూడా అంటారు. ఇది తెల్లజాతి పశువుల్లో ఎక్కువగా సంక్రమిస్తుంది. క్లాస్ట్రిడియం చావోయి బ్యాక్టీరియా వలన వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు...
కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా, గాయాల వలన ఈ వ్యాధి పశువులకు సోకుతుంది. తీవ్రమైన జ్వరం ఉండి ఆహారం తీసుకోకపోవడం, కుంటడం, ఆకస్మికంగా భుజం, తొడ భాగాల్లో వాపు కనిపిస్తుంది. కండరాల ప్రాంతంలో బ్యాక్టీరియా విష పదార్థాన్ని విడుదల చేయడం ద్వారా ఆ ప్రాంతంలో చర్మం కుళ్లిపోతుంది. కొన్ని దూడల్లో ఈ లక్షణాలు కనిపించకుండానే కిందపడి కొట్టుకుని కొన్ని గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతాయి.

చికిత్స, నివారణ చర్యలు
వ్యాధి సోకిన పశువులకు పెనిఫల్లిన్స్ ఎఫ్‌పీపీ 40ఎంఎల్ ఐవీ, చిన్న దూడలకు 20ఎంఎల్ ఐవీ ఇవ్వాలి. ఆంటీఇన్‌ఫ్లమటరీ, ఎన్ఎస్ఏఐడీఎస్, బీకాంప్లెక్స్ ఇంజక్షన్ వేయాలి.

గొంతువాపు :
దీనినే పాశ్చురెల్లోసిస్ అని కూడా అంటారు. ఇది ముఖ్యంగా పశువుల్లో, ప్రధానంగా గేదెల్లో వ్యాపిస్తుంది. పాశ్చురెల్లా మల్టోసిడా బ్యాక్టీరియా వలన ఈ వ్యాధి సోకుతుంది. ఈ బ్యాక్టీరియా సాధారణంగా పశువుల గ్రసనిలో ఉంటుంది. వాతావరణం బ్యాక్టీరియాకు అనుకూలంగా మారినప్పుడు ఇది ఎక్కువగా వృద్ధి చెంది వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు
వ్యాధి సోకిన పశువు చొంగతో తాగునీరు, గడ్డి కలుషితమై ఇతర పశువులకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, చొంగకారడం, గొంతు, మెడ, ముందరి కాళ్ల మధ్యలో నీరు చేరడం, కంటి నుండి నీరు కావడం, ఊపిరితిత్తులకు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది.

చికిత్స, నివారణ చర్యలు
వ్యాధి సోకిన పశువులకు సల్ఫాడిమిడిన్ యాంటీ బయోటిక్ 150 మిల్లీ గ్రాములను ఇంజక్షన్ రూపంలో డైల్యూట్ చేసి అందించాలి. ఆంటీ ఇన్‌ఫ్లమటరీ నాన్ స్టిరాయిడ్, ఆంటీ ఇన్‌ఫ్లమటరీ డ్రగ్స్ ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డెక్సన వంటి స్టిరాయిడ్స్ అందించాలి. సీజన్‌కు ముందే వ్యాక్సినేషన్ వేయించడం ద్వారా వ్యాధి ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టవచ్చు.

చిటికె రోగం :
దీనినే పల్స్ కిడ్నీ డిసిస్ అంటారు. అధికంగా ఆహారం తినడం వలన ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్ట్రిడియం పర్‌ఫ్రంజెన్స్ బ్యాక్టీరియా టైప్ సీ, డీ అనే స్ట్రెయిన్స్ వలన గొర్రెలు, మేకలకు వ్యాధి సోకుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు
మట్టి కలిసిన గడ్డిని తినడం, వర్షాలు కురిసిన సమయంలో అధిక మోతాదులో గడ్డిని మేయడంతో నట్టలు ఎక్కువగా తయారవుతాయి. దీంతో బ్యాక్టీరియా అధికంగా వృద్ధి చెంది ఎప్సిలాన్ ట్యాక్సిన్‌ని పొట్టలో విడుదల చేయడంతో విరేచనాలు అవుతాయి. ఇవి ట్యాక్సిన్ బ్రెయిన్‌కు చేరి ఫిట్స్ వస్తుంది. బ్రెయిన్‌కి చేరిన సమయంలో పశువులు గాలిలో ఎగిరి చిటికె వేసే సమయంలో చనిపోతాయి. టైప్–డీ కిడ్నీలో చేరడంతో కిడ్నీలు గుజ్జువలే తయారవుతాయి. వ్యాధి సోకిన జీవాల్లో విరేచనాలు, కడుపుబ్బరం, వణుకు, పళ్లు కొరకడం, జ్వరం, ఫిట్స్ వచ్చినట్లు కొట్టుకోవడం చేస్తాయి.

చికిత్స, నివారణ చర్యలు
వ్యాధి సోకిన జీవాలకు ఆంపిసిల్లిన్, క్లోరాంఫినికాల్ మందులు వేయాలి. రిహైడ్రేషన్ సొల్యూషన్, సపోర్టివ్ థెరపీ అందించాలి. ముందస్తు టీకాలు వేయించాలి.

గాలి కుంటు వ్యాధి:
ఈ వ్యాధిని ఫుట్, మౌత్ డిసీస్ అంటారు. ఆవులు, గేదెలు, తెల్లజాతి పశువుల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. పికోర్నొ ఫ్యామిలీకి చెందిన అఫ్థస్ వైరస్ వలన ఈ వ్యాధి సోకుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు
వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, కాలి పుండ్లు, నోట్లో, చిగుర్లలో బొబ్బలు, పాలిచ్చే వాటిలో పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన చిన్న దూడలు చనిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స, నివారణ చర్యలు
ఈ వ్యాధి వైరల్ వ్యాధి కావడంతో పూర్తి స్థాయిలో చికిత్స ఉండదు. సెకండరీ ఇన్‌ఫెక్షన్స్ రాకుండా ఆంటీబయోటిక్స్ పెనిసిల్లిన్స్ వాడాలి. నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ పేస్ట్ రాయాలి. కాలి పుండ్లకు పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రంగా కడిగి ఆంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్ రాయాలి. ఎన్ఎస్ఏఐడీఎస్, ఆంటీ ఇన్‌ఫ్లెమటరీ డ్రగ్స్, లివర్‌టానిక్స్, మల్టీవిటమిన్ టానిక్స్ కచ్చితంగా వాడాలి. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయించాలి.

ముందస్తు జాగ్రత్తలు అవసరం



మూగజీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోవాలి. జీవాలు వ్యాధుల బారిన పడక ముందే ముందస్తు టీకాలు వేయించడంతో పాటు పశు వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– మాను సుజాత, పశువైద్యాధికారి, ఆకెనపల్లి, బెల్లంపల్లి మండలం

నిజాయతీ చాటుకున్న కండక్టర్


సొమ్ము అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకొన్న మంగళసూత్రాన్ని బాధితురాలికి అప్పగించి కండక్టర్ ఆశన్న తన నిజాయతీని చాటుకున్నాడు. ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుండి ఆసిఫాబాద్‌కు వస్తుండగా మంచిర్యాల జిల్లా కళ్యాణిఖనికి చెందిన సాంబమూర్తి, లక్ష్మి దంపతులు మందమర్రి స్టేజీ వద్ద ఎక్కి బురుగూడ స్టేజీ వద్ద దిగారు. కండక్టర్ ఆశన్నకు బస్సులో మంగళసూత్రం దొరకడంతో డిపోలోని ఎర్నింగ్ సెక్షన్‌లో డీసీఈకి అప్పగించారు. బాధితులు డిపో అధికారులను సంప్రదించగా సోమవారం అప్పగించారు. కండక్టర్ నిజాయతీని డిపో మేనేజర్ విశ్వనాథ్, అధికారులు అభినందించారు.

28 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి, జిల్లా కమిటీ సభ్యుడు జీ.అశోక్ తెలిపారు. సోమవారం బెల్లంపల్లిలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తల్లో రాజకీయ చైతన్యం నింపడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నాయకులు రమణ, దేవదాసు, తిరుపతి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికి కొత్త గనులు కేటాయించాలి

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నరసింహారావు


కార్మికులతో మాట్లాడుతున్న నరసింహారావు

శ్రీరాంపూర్: సింగరేణికి కొత్త గనులను కేటాయించాలని సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆర్కే న్యూటెక్ గనిలో కార్మికులను కలిసి మాట్లాడారు. కోయగూడెం ఓసీపీ 3 బ్లాక్, సత్తుపల్లిలో ఓసీపీ 3 బ్లాకును అరబిందో ఫార్మా కంపెనీకి ఇవ్వడం సరికాదన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా ఆ కంపెనీకి నుంచి బీజేపీకి కోట్లాది రూపాయల డబ్బులు ముట్టడంతోనే గనులను కేటాయించిందన్నారు. ఈ గనులను రద్దుచేసి సింగరేణికి కేటాయించేలా బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కృషి చేయాలన్నారు. గతంలో సింగరేణి 15 బొగ్గు బ్లాక్‌ల పర్మిషన్లకు దరఖాస్తు చేసుకుంటే వాటిని సింగరేణికి కేటాయించకుండా వేలంలో పెట్టడం సింగరేణి మునగడకు విఘాతం కలిగించేలా ఉందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని యూనియన్లను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. అవసరమైతే నిరధిక సమ్మె కూడా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్లా బాలాజీ, నాయకులు అంబాల శ్రీనివాస్, జీవన్, సిరికొండ శ్రీనివాస్, పెరిక సదానందం, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి


శిరీషరెడ్డిని సన్మానిస్తున్న లీగల్ సెల్ సిబ్బంది

శ్రీరాంపూర్: కోర్టుల్లో సింగరేణిపై వేసిన కేసుల సత్వర పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని సింగరేణి లీగల్ సెల్ శ్రీరాంపూర్ ఏరియా డిప్యూటీ జనరల్ మేనేజర్ శిరీషరెడ్డి పేర్కొన్నారు. తాజాగా డీజీఎంగా పదోన్నతి పొందిన ఆమెను శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని లా డిపార్టుమెంట్ చాంబర్‌లో సోమవారం అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కంపెనీకి ఎల్లవేళలా సేవ చేస్తూ న్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏరియా సీనియర్ లా ఆఫీసర్ ప్రబంధిత, లీగల్ సెల్ ఉద్యోగులు శ్యామల, రమ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో సింగరేణి కార్మిక సంఘాల నాయకులను కలిసి వినతి పత్రం అందజేశారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కే రాజకుమార్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్‌లను కలిసి తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రారావు, ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసీరెడ్డి, కంపెనీ మాజీ డైరెక్టర్ డీ దత్తాత్రేయులు, తదితరులు ఉన్నారు.

ట్రెజరీలోనే చెక్కులు

- ఆర్థిక సంవత్సరం ముగిసినా పాస్‌కాని వైనం
- ఆందోళనలో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు
- పంచాయతీల్లో ఖర్చు చేసిన బిల్లులకు జాప్యం



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ పనులకు సంబంధించి నెలల తరబడి బిల్లుల చెల్లింపులు జరగక ట్రెజరీలో చెక్కులు మూలుగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం చివరిలో చెక్కులు క్లియర్ అవుతాయని ఆశించిన ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులకు నిరాశే మిగిలింది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ట్రెజరీలో జమ చేసిన చెక్కులతోపాటు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే నెల చెక్కులు మొత్తంగా మంచిర్యాల జిల్లాలో దాదాపు 1,200 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఇంజినీరింగ్ విభాగం, పే అండ్ అకౌంట్స్(పీఏఓ)కు సంబంధించి రూ.25 కోట్లకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనులను అప్పులు చేసి పూర్తి చేయగా.. బిల్లులు సకాలంలో రాక ఆందోళన చెందుతున్నారు. చెక్కుల కాలపరిమితి ముగిసిందని రిజెక్ట్ చేస్తుండడంతో తిరిగి చెక్కులు ట్రెజరీలో అందజేయడం తలకు మించిన భారంగా మారింది. మంచిర్యాల జిల్లాలోని 311 గ్రామ పంచాయతీలకు సంబంధించి దాదాపు 10 నెలలుగా చెక్కులు పాస్ కావడం లేదు. ఫిబ్రవరి ఒకటితో పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. అప్పటి వరకు పదవుల్లో కొనసాగిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పంచాయతీ నిధులతో పనులు చేయించారు. బిల్లుల కోసం ఎంబీ చేయించి చెక్కులు ట్రెజరీ పంపించినా ఖజానాలో నిధుల కొరతతో చెల్లింపులు జరగడం లేదు. అప్పులు తెచ్చి మరీ పనులు పూర్తి చేయగా బిల్లులు రాక వడ్డీలు పెరిగిపోతున్నాయని లబోదిబోమంటున్నారు.

రిజెక్ట్ అయితే..
పంచాయతీల చెల్లింపుల కోసం ఇచ్చిన చెక్కులు ట్రెజరీలో మూలుగుతున్న నేపథ్యంలో వాటి కాలపరిమితి ముగిసి రిజెక్ట్ అవుతాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా చెల్లింపులు జరిగితే ఏ ఇబ్బందులు ఉండవు. కానీ మార్చి 31 దాటిపోయినా ఇప్పటికే ఒక్క చెక్కు పాస్ కావడం లేదు. ఒకవేళ చెక్కుల కాలపరిమితి ముగిసిందని రిజెక్ట్ అయితే తిరిగి రాయించడం పెద్ద సమస్యగా మారుతోంది. చెక్కుల కాలపరిమితి ముగిసినా ప్రభుత్వం వాటిని అనుమతిస్తే అలాగే వాడుకునే అవకాశం ఉంటుందని కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. అవసరమైతే చెక్కులను రిజెక్ట్ చేయకుండా కొంతకాలం హోల్డ్‌లో ఉంచాలని అంటున్నారు.

అందరూ ఏకమై కుక్కను చంపేశారు


గ్రామస్తుల చేతిలో హతమైన కుక్క

వేమనపల్లి: రెండు రోజులుగా వేమనపల్లితో పాటు దస్నాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో స్వైర విహారం చేసి ఎనిమిది మందిపై దాడికి పాల్పడిన వీధి కుక్కను గ్రామస్తులంతా ఏకమై చంపేశారు. ఆదివారం వేమనపల్లిలో దాడి చేసిన కుక్క దస్నాపూర్, కొత్తపల్లి మీదుగా కొత్త కాలనీకి వెళ్లింది. అక్కడే రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మర్మల వెంకటిపై దాడి చేసింది. అదె నాందేవ్‌కు చెందిన ఎద్దును తీవ్రంగా గాయపర్చింది. గ్రామస్తులు అరుస్తూ కేకలు వేయడంతో దస్నాపూర్ కొత్తగుడిసెల వైపు పరుగులు తీసింది. రోడ్డుపై ఉన్న యువకులపై దాడికి యత్నించగా గ్రామస్తులు సమయస్ఫూర్తితో వ్యవహరించి కుక్కను అడ్డుకున్నారు. కర్రలతో దాడి చేసి చంపేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కౌటాల: మండలంలోని గురుడుపేట–బోదంపల్లి ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ గ్రామానికి చెందిన నిరుపన్ బిశ్వాస్ (35) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిరుపన్ బిశ్వాస్ కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం నుంచి స్వగ్రామం రవీంద్రనగర్‌కు బైక్ పై వెళ్తుండగా గురుడుపేట సమీపంలో బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి నిర్మల్ బిశ్వాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుప్పిని హతమార్చిన ముగ్గురి రిమాండ్


నిందితులను చూపిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని వేంపల్లి ఫారెస్టు బీట్ పరిధిలో ఈనెల 13న దుప్పిని హతమార్చిన ముగ్గురికి రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్‌వో రమాదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి శశిధర్‌బాబు తెలిపారు. ఈ నెల 13న వేంపల్లి అటవీ ప్రాంతంలో కొందరు దుప్పిని హతమార్చినట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపించామన్నారు. నిందితులు సిర్పూర్ (టి) మండలంలోని మన్నెగూడ గ్రామానికి చెందిన నాయని అశోక్, రాలే అంజి, టేకం తిరుపతిని అరెస్టు చేసి సోమవారం సిర్పూర్ (టి) కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం మనోహర్

- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ పోస్టుల భర్తీ కోసం మంగళవారం నుంచి నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. పరీక్షలు నిర్వహించే ప్రగతి మైదానంను సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ పోస్టుల భర్తీలో భాగంగా ఇక్కడ డ్రైవింగ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. దీనికి కావాల్సిన ఏర్పాట్లు సరిగ్గా ఉండాలన్నారు. అభ్యర్థులు ఎండకు ఇబ్బంది పడకుండా టెంట్లు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను, వైద్య సిబ్బందిని, అంబులెన్సును అందుబాటులో ఏర్పాటు చేయాలని జీఎం సూచించారు. పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం పురుషోత్తం రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం వర్క్‌షాప్ రవీందర్, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో 18, 19న ఈపీ ఆపరేటర్స్ ట్రైనీల ఎంపిక కోసం యాజమాన్యం పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఏరియా జీఎం మనోహర్ సోమవారం అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని ఆపరేటర్స్ ట్రైనీల ఎంపిక కోసం 187మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారని, నిష్పక్షపాతంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని తెలిపారు. ఆయన వెంట ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఎస్‌వో రవి, అధికారులు, యూనియన్‌ల ప్రతినిధులు ఉన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

దహెగాం: మండలంలోని హత్తినిలో సోమవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామానికి చెందిన తాళ్లపల్లి మనోజ్‌రావ్ ట్రాక్టర్‌లో నకిలీ విత్తనాలు తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు 1.24 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వాటి విలువ రూ.3.10 లక్షలు ఉంటుందన్నారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాజులనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాళ్లపల్లి మనోజ్‌రావు, ట్రాక్టర్ డ్రైవర్ సింహాద్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గొల్లపేట్ కాలనీకి చెందిన ప్రమోద్ (31) వృత్తి రీత్యా ఓ హోటల్లో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి బయట ఉండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హై టెన్షన్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.